# 'బావతో చెలగాటం'

★

రచన:
లింగం సుధాకర్

"ఏయ్ బావా! బావా!"

"......................."

"ఏయ్ బావా? నిన్నే మాట్లాడవే. చెవుడేమిటి ఖర్మం కొద్దీ?"

"......................."

"ఏయ్ కోతీ! కోతిబావా?"

"ఏంటి రమా ఏంటి? మర్యాదలేకుండా......"

"లేకపోతే మరేంటి? పిలుస్తే వినబడలేదూ?"

"నేను పుస్తకం చదువుతున్నా కనబడలేదూ?"

"ఓహెూ! ఆ నవలను పరీక్షలకు చదివేస్తున్నారేంటి? అలసిపోయావులాగుంది. సోడా ఏమైనా......"

"సోడా నాకేమీవద్దు. నీవేత్రాగు కావాలంటే. ఇంతకీ నన్నెందుకు పిలిచావు?"

"నిన్ను నేను ఎప్పుడు పిలిచానుబావా?" కలగంటున్నావేంటి?"

"ఇప్పుడేగా నన్ను పిలిచింది. ఇంత అబద్ధాలు కూడానా?"

"ఇదొక్కటికూడానా? కుట్టు అల్లుకుంటున్న నన్ను గావు కేకలుపెట్టి పిలిచి, ఇంక నేను పిలిచానంటున్నావే? బలేగావుంది. చెయ్యి వదులుబావా? వదలమంటుంటే..."

"నేను వదలను. నిజంచెప్పేవరకూ వదలను."

"ఏంటిబావా? నీపని బలేగావుందే. నువ్వే నన్ను పిలిచి ఇంక నిజంచెప్పమంటే ఏంచెప్పను. చెయ్యివదులు బావా? నెప్పి పుడతావుంది. ఇదిగో వదలకపోతే అమ్మను పిలుస్తాను."

"పిలువు నాకేమన్నా భయమా?"

"అమ్మోవ్! అమ్మా ఇక్కడ బావ నన్ను......"

"అరెరె పిలవ్వద్దు. వదిలానుగా."

"అట్లారా దారికి. రమంటే ఏమనుకున్నావో?"

"........................"

"సరేగాని బావా! నువ్వుచదివే ఆ పుస్తకం ఏంటి?"

"........................"

"ఏయ్ బావా! నిన్నే! ఈసారి మూగకూడ వచ్చిందే!"

"ఏంటి అర్థంలేకుండా మాట్లాడుతున్నావు?"

"తెలుగు. మరి పిలిస్తే మాట్లాడవే."

"నేను చదివేదేంటో కనబడటల్లేదా? పుస్తకం."

"అంతకోపం ఎందుకే బావా? నీకు ఇష్టంలేకపోతే మాట్లాడనులే."

"ఛా! నీమీద నాకు కోపం దేనికి రమా. ఇంతకీ నువ్వొచ్చిన పనేంటి?"

"టైం పన్నెండు కావస్తావుంటే ఆకలేస్తుల్లా? అన్నానికి రమ్మంటావుంది అమ్మ."

"సరే పద."

"అమ్మా! అమ్మా! ఈవేళ బావకు ఆకలిలేదంట. ఎంతచెప్పినా వినటంలేదు. నీతోనే చెప్పతానని వచ్చాడు."

"అదేంటి బాబూ! ప్రొద్దున టిఫిన్‌కూడ సరిగ్గా తినలేదే? కొంచెంగా తిను బాబూ!"

"రమ గల్లంతు మరీ ఎక్కువవుతావుంది అత్తయ్యా! నేనిప్పుడు అన్నానికే వచ్చాను."

"అదేంటే రమా! పిచ్చిమాటలు. రేపు పెళ్లిఅయితే అసలు అన్నమే పెట్టేటట్టుగాలేవే?"

"మీ రమను పెళ్ళిచేసుకుంటే బ్రతకనిస్తుందా? నాకొద్దు బాబూ, కొంచెంకూడా భయపడందే నాకు!"

"అదేంటిబావా భయం గియం అంటున్నావేంటి? ఎప్పటికీ, ఎవ్వరికీ అసలు భయపడను. ముందే చెప్పతున్నాను అబ్బాయ్."

"సరే చూద్దాంలే. అప్పటికిగాని నీకు తెలీదు."

* * * *

"ఇదిగో రమా! ఇకపైన నన్ను ఏయ్ బావా, గీవా అంటేఒప్పుకోను. ఇందాక అసుశీల నవ్వుతావుంది తెల్సా?"

"అబ్బా ఏంటి మీగోల. భర్తను బావా అని పిలవకుండా ఇంకేమని పిలిచేది?

"అదితప్ప ఇంకేమీ మాటలేదూ?"

"సరే రేపటినుంచి ప్రాణనాథగారూ అంటాలే."

"ప్రాణనాథా అనవద్దు, గీ ణ నా థా అనవద్దుగాని, 'ఏమండీ' అని పిలువు."

"నా కదంతా తెలియదు. బావా అని అంటాను. ఇష్ట మైతే పలకవచ్చు. లేకపోతే ఊరుకోవచ్చు."

"అయితే నాతో మాట్లాడబోక. ఈవేళనుంచి నేనూ నీతో మాట్లాడవలచుకోలేదు."

"అయితే బ్రతికిపోయాను. నాకు సంతోషంగావుంది"

"అవును నీకు సంతోషంగానే ఉంటుంది. నీ కింత బొత్తిగా, భయభక్తులులేవని తెలుస్తే అసలు నిన్ను పెళ్ళి చేసుకొనేవాడినే కాను."

"ఐతే నేను కావాలని పెళ్ళిచేసుకున్నానన్నమాట. నేను ఆవేళే చెప్పాను. అసలు నేనెవ్వరికీ భయపడనని."

"అప్పుడు నోటికొచ్చినట్లుగా మాట్లాడావని, ఇప్పుడు కూడ మాట్లాడతావన్నమాట. అసలు నిన్ను పెళ్ళిచేసుకుంటానికి నాకు ఇష్టమేలేదు ఏదో మా వాళ్ళు బలవంతం చేసారు గానీ........."

"అంతేలే బావా! నువ్వు ఎప్పుడైనా సత్యహరిశ్చంద్రుడి ఇంటిప్రక్క నున్నావేంటి? అంతా నిజమే చెప్తున్నావు. ఆవేళ నేను తలుపుప్రక్కనుండి వినలేదనుకున్నావా? మాఘ మాసంలో కావలసిన పెళ్ళిని ఇప్పుడే చేయించుకున్నావు. ఇంక ఏంటో మామీద దయతలచినట్లుగా మాట్లాడుతున్నావు."

"ఏదో చిన్నపిల్లవు ఉన్నూరుకుంటావేమోనని గాని, నీకింత భయభక్తులులేక వుంటాయని నేను కలగన్నానా?"

"అంతేలే, ఒప్పుకుంటున్నా. సరే నువ్వు ఇప్పుడు ఇంతకీ అన్నానికి వస్తావా? రావా?"

"..........................."

"ఏయ్ బావా నీకేచెప్పేది."

"నాకేంవద్దు. నీవే తిను. నాకు ఆకలిలేదు."

"సరే నాకూవద్దు. అన్నాన్ని తర్వాత కు డి తి లో పోసేస్తాలే."

"వృధాగా వండినఅన్నాన్ని కుడితిలోపొయ్యటం ఎందుకు? సరే లెగు, రా! అయితే నీకుమట్టుకు కాస్త భయభక్తులు తప్పక ఉండాలిలే."

"అదంతా నాకు తెలీదు. ఏయ్ బావా నువ్వింతకీ అన్నానికి వస్తావా? రావా?

*　　*　　*　　*

"ఏయ్ బావా! ఒక్కసారి రా. చిట్టిగాడు ఇక్కడ ప్రాణాలు తీసేస్తున్నాడు. ఒక్కసారివచ్చి ఎత్తుకో."

"కాస్త మర్యాదగా మాట్లాడటం ఇప్పుడన్నానేర్చుకో. ఒక్క బిడ్డతల్లివయ్యావ్. కొంచెంకూడ వివేకంలేదే?"

"అబ్బ, నన్నేంచేయమంటావు బావా! అట్లా పిలిస్తే కాని నాకు పిలిచినట్లుగా ఉండదు."

"సరే దీనికొక మంత్రం తెలుసుకున్నా. నిన్ను రేపే మీపుట్టింటికి పంపించేస్తున్నా. అత్తయ్యకు ఈవేళే ఉత్తరం వ్రాసేస్తున్నా. రమ నేనంటే భయభక్తులులేకుండా ఉంటున్నదని."

"అవునుబావా! నేను పుట్టింటికివెళ్ళి చాలదినాలయినాయి. ఒక్కవారం సెలవుపెట్టిరా. ముగ్గురం వెళదాం. ఇంక ఉత్తరంవ్రాయటం ఎందుకు? అక్కడికెళ్ళి మొర పెట్టుకుందురుగాని మీ అత్తయ్యకు."

"నేనెంత సీరియస్‌గాచెప్పినా నీకు వేళాకోళంగానే ఉంటుంది. నువ్వు నన్ను మర్యాదగా పిలిచేవరకూ నిరాహారదీక్ష చేద్దామనుకుంటున్నా."

"మంచిది. అయితే ఒక్కసలహా. ఊరికే ఇంట్లో కూర్చుని నిరాహారదీక్ష చేసేందుకన్నా అట్లా రోడ్లోకిపోయి చేయండి, విశాలాంధ్రకని వంకపెట్టి. కనీసం మీ పేరన్నా పేపర్లలో పడుతుంది."

"ఇంక నీతో లాభంలేదు. నాకింక దం డో పా య మొక్కటి మిగిలివుంది. ఈతడవ 'ఏయ్ బావా' అన్నప్పుడల్లా ఒక్కొక్క మొట్టికాయ వేస్తావుంటా. అంతటితో తిక్క వదులుతుంది అమ్మాయిగారికి."

"ఎప్పుడో ఒకకవి ఒకపాట వ్రాసాడు బావా. 'తమలపాకుతో నీ వొకటంటే, తలుపుచెక్కతో నే రెండంటాన'ని జ్ఞాపకముందా?"

"ఆ! వ్యవహారం ముదిరిందే. అయితే నీవీలోకంలో ఇంకెవరికి భయపడతావు?"

"ఇంకోళ్లకు భయపడవలసిన అవసరం నాకేంవుంది. నా చిట్టిరాజాకుతప్ప. ఇంకెవరికి ఎప్పుడూ భయపడను. ఏయ్ బావా తెలముఖం వేస్తున్నావేంటి? తెల్సిందా?"